

చీనీ టన్ను రూ.28,310
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28,310 పలికాయి.



టమాట కిలో రూ.17
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/ 15.3°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉగ్గాని, బజ్జీ తిని 10 మందికి అస్వస్థత



ఉరవకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ: స్థానిక భవాని ఆలయంలో భక్తుల ఇరుముడి కార్యక్రమంలో మంగళవారం అపశ్రుతి చోటు చేసుకుంది. ఉగ్గాని, బజ్జీలు తిని ఫుడ్ పాయిజన్ కావడంతో తీవ్ర అస్వస్థతకు గురై 10 మంది ఆసుపత్రిలో చేరారు. వివరాలు.. భవాని ఆలయంలో మంగళవారం అమ్మవారి మాలధారుల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్సీ కాలనీ, సత్యనారాయణపేటకు చెందిన కోమేశ్వరీ, మమత, గోవిందమ్మ, జ్యోతి, అంజినమ్మ, రమేష్, మధు, గోవిందు, పావని, శరత్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కొంతమంది భక్తులు తీసుకొచ్చిన ఉగ్గాని, బజ్జీని తిన్నారు. ఇంటికి వచ్చిన తరువాత వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే కుటుంబీకులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ అయినట్లు వైద్యులు గుర్తించి చికిత్సలు అందించారు.

తత్కాల్ కింద 'పది' పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించేందుకు చివరి అవకాశంగా తత్కాల్ కింద వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 1000 అపరాధ రుసుంతో ఈనెల 27 నుంచి 2025 జనవరి 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ కోరారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు చొరవ చూపాలని ఆదేశించారు.

రెండు మట్టి టిప్పర్ల పట్టివేత



పట్టుకున్న మట్టి టిప్పర్లతో జేఈ నూర్జహాన్

సాక్షి ఎఫెక్ట్..

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామ చెరువు నుంచి పర్మిట్లు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం అధికారులు పట్టుకున్నారు. గ్రామ సమీపంలో స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. 'చెరువులో మట్టి రాబందులు' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు యాడికి మండల ఇరిగేషన్ జేఈ నూర్జహాన్ రెండు టిప్పర్లను పట్టుకుని స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్‌ఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో జిల్లా జడ్జి



ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుంటున్న జడ్జి శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జడ్జి శ్రీనివాస్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి జడ్జి కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కరుడు గట్టిన నేరస్తుల ఆట కట్టించారు.
నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టించారు.
అందరిచేతా శభాష్ అనిపించుకున్నారు. కానీ,
ఇదంతా గతం. ఒకప్పుడు ఘనకీర్తి మూటుగట్టుకున్న
జిల్లా పోలీసులు నేడు నీరసించిపోయారు.
పైగా స్వార్థ రాజకీయ నాయకుల పుణ్యమా అని అప్రతిష్ట
పాలవుతున్నారు. బాధితుల పక్షాన నిలిచి ధైర్యం చెప్పకుండా
వారిపైనే దౌర్జన్యం చేస్తున్నారు.



నీరసించిన నాలుగో సింహం

రాజకీయ 'క్రీనీడ'లో ఖాకీ

- చిల్లర దొంగతనాల నిందితులను పట్టుకోవడానికే పరిమితం
- కాపర్‌వైర్‌ల దొంగలు, చైన్‌స్నాచర్‌లను పట్టుకుని ప్రెస్‌మీట్‌లు
- గోవా మద్యం భారీ డంప్ కేసులో కానరాని ప్రధాన నిందితుడి జాడ
- 'రాయదుర్గం'లో రాములోరి రథం కాల్చిన కేసులోనూ పురోగతి అంతే
- మితిమీరిన రాజకీయ జోక్యంతో అప్రతిష్ట



ఇటీవల రాప్తాడు సమీపంలో భారీగా పట్టుబడిన గోవా మద్యం బాక్సులు (ఫైల్), ఈ కేసులో ప్రధాన సూత్రధారిని పట్టుకోవడంలో పోలీసులు ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా పోలీసుల ప్రతిష్ట మసకబారిందా? మితిమీరిన రాజకీయ జోక్యంలో నలిగిపోతున్నారా? బాధితుల పక్షాన నిలబడాల్సిన వాళ్లు నిందితుల వైపు మొగ్గు చూపుతున్నారా?...ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానాలే వస్తున్నాయి. గతంలో ఎన్నో క్లిష్టమైన కేసులకు అలవోకగా పరిష్కారం చూపిన జిల్లా పోలీసులు.. నేడు ఓ మోస్తరు తీవ్రమైన కేసులను కూడా ఎందుకు ఛేదించలేకపోతున్నారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు తమ పనితీరుతో రాష్ట్ర స్థాయిలోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న జిల్లా ఖాకీలు.. ఇప్పుడెందుకు కేవలం కాపర్‌వైర్‌ల దొంగలకు మాత్రమే పరిమితమయ్యారనే విషయం చర్చనీయాంశంగా మారింది.

అథమ స్థాయికి..


గడిచిన ఐదేళ్లలో అంటే 2019–24 మధ్య జిల్లా పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. అంతర్జాతీయ నేరగాళ్ల ద్వారా చలామణీ అవుతున్న హవాలా సొమ్మును పట్టుకుని ముఠా ఆట కట్టించారు. అంతర్రాష్ట్ర దొంగలను చాకచక్యంగా పట్టుకుని ఒకేసారి 50 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపారు. గతంలో కర్ణాటక మద్యం జిల్లాలోకి తేవాలంటే అక్రమార్కులు భయపడేవారు. అలాంటి పోలీసులు కూటమి సర్కారు వచ్చాక పూర్తిగా మారిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్‌లు దొంగలించే వారిని, చైన్‌స్నాచర్లను పట్టుకుని ప్రెస్‌మీట్ పెట్టి గొప్పలు చెప్పుకునే స్థాయికి దిగజారారు. సైలెన్సర్ లేని బైకుల పొగ గొట్టాలను ఊడదీసి రోడ్డురోలర్ కింద తొక్కిస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు.

వైఫల్యాల్లో మచ్చుకు కొన్ని..

- తాడిపత్రిలో సీఐ లక్ష్మీకాంత రెడ్డి చట్టబద్ధంగా వ్యవహరించినా ఉన్నతాధికారులు ఆయనదే తప్పన్నట్లు ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పించడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది.
- రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో రాముల వారి రథానికి నిప్పుపెట్టిన కేసును ఇప్పటికీ తేల్చలేదు. దుండగులను పట్టుకోనే లేదు. రాజకీయ జోక్యంతో కేసు నీరుగార్చారనే విమర్శలున్నాయి.
- ఇటీవల రాప్తాడు సమీపంలో రూ.66 లక్షల విలువ చేసే గోవా మద్యం పట్టుబడితే ఇప్పటివరకూ అసలు నిందితుణ్ని పట్టుకోలేకపోయారు.
- తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని శాంతిభద్రతల నెపంతో 7 నెలలుగా తాడిపత్రికి వెళ్లనివ్వడం లేదు. ఇంతకంటే ఘోర వైఫల్యం మరోటి లేదనే విమర్శలున్నాయి.
- తాడిపత్రికి చెందిన బోయ రవికుమార్ అనే వ్యక్తి షాపునకు కొన్ని రోజుల క్రితం జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు తాళాలు వేశారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే సీఐ సాయిప్రసాద్ తీసుకోకపోగా.. బాధితుడినే మందలించి పంపించారు.
- జిల్లాలో మట్కా, పేకాట, గంజాయి వ్యవస్థీకృత నేరాలుగా మారాయి. కట్టడి చేయడంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. .
- బహిరంగ మద్యపానం, బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులై పారుతున్నా కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఎన్నో కుటుంబాలకు చెందిన మహిళలు పోలీసులను దుమ్మెత్తి పోస్తున్నారు.

క్రీస్తు జననం శాంతికి సంకేతం

- జిల్లా ప్రజలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత క్రిస్మస్ శుభాకాంక్షలు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్టియన్ మైనార్టీ సోదరులు పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రీస్తు జననం శాంతికి సంకేతమని, తన జీవితం, మరణం ద్వారా లోకానికి సరైన మార్గాన్ని ఏసు ప్రభువు చూపారని తెలిపారు. ప్రేమ, కరుణకు ప్రతీక ఏసు ప్రభువని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రిస్టియన్ సంస్థలు సేవాతత్పరతతో ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. సమాజంలో చెడును పక్కన పెట్టి మంచిని పెంపొందించాలని సూచించారు. ఏసుక్రీస్తు బోధనలు సన్మార్గంలో నడిచేలా చేస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమపూర్వకమైన జీవన మార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసు ప్రభువు అని అన్నారు. తన పేరుతో ఒక శకానికి నాంది పలికిన క్రీస్తు చరిత్ర పవిత్రం, ఆయన జన్మదినం సర్వ మానవాళికి పవిత్ర దినం అని పేర్కొన్నారు.

- అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ వసీం కూడా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరిపై ఏసు దయ ఉండాలని ఆకాంక్షించారు.

ఏసుమార్గం అనుసరణీయం

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసు క్రీస్తు చూపిన ప్రేమ మార్గాన్ని అందరూ అనుసరించాలన్నారు. ఆయన కృపతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షించారు. క్రైస్తవులు పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.

వాతావరణ ఆధారిత సాగుతో మేలు

- ఏఎఫ్ ఎకాలజీ ప్రాజెక్టులో రైతులు భాగస్వాములు కావాలి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, చిత్రంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ పరిస్థితుల ఆధారంగా వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటుందని, ఆ దిశగా ఏఎఫ్ ఎకాలజీ చేపట్టిన ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'క్లైమేట్ రెసిలియెంట్ అగ్రికల్చర్ ప్రోగ్రాం'పై ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ప్రతినిధులతో కలిసి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకాలజీ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు మండలాల పరిధిలో యర్రబోరేపల్లి, ముచ్చర్లపల్లి, లింగదార్లహళ్లి, మందలహళ్లి, బండమీదపల్లి, మహంతపురం, అల్లాపురం, విట్లంపల్లి, ఎం.వెంకటాంపల్లి, పి.కొత్తపల్లి తదితర 10 గ్రామాలను ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలియజేశారు. కూడేరు మండలంలో ఒక గ్రామాన్ని త్వరలోనే ఎంపిక చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయం, పాడి, పశుపోషణ, ఉద్యానతోటలు, ఇతరత్రా జీవనోపాధులపై అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. వాతావరణ పరిస్థితులు, వర్షాలు, ఉష్ణోగ్రతలు, నేల రకాలను విశ్లేషిస్తామన్నారు. ఆ తర్వాత సమగ్ర ప్రణాళిక తయారు చేసి ఎప్పుడు ఏ పంటలు వేసుకోవాలో రైతులకు తెలియజేయడంతో పాటు పశుపోషణ, ఉద్యాన రంగం, సూక్ష్మసాగు పద్ధతులు తదితర అంశాల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఐదేళ్ల పాటు సాగే ఈ ప్రాజెక్టులో ఏఎఫ్ ఎకాలజీకి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సహకరిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జిల్లా అంతటా అమలు చేయడానికి దోహద పడుతుందన్నారు. రైతులు, కూలీలు, ఇతరత్రా అన్ని వర్గాలకు ఎంతగానో మేలు జరిగే ప్రాజెక్టు విజయవంతానికి అందరూ సహకరించాలని సూచించారు. గ్రామ సమూనాలు తయారు చేసి ఆయా శాఖల అధికారులు 8 మందితో టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ కమిటీలు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి హాజరై ప్రాజెక్టు గురించి వివరించారు. సమావేశంలో ఏఎఫ్ ఎకాలజీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీక్రిష్ణ, స్టేట్ లీడ్ భక్తర్ వలీ, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు, డ్వామా పీడీ సలీంబాషా, పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, నాబార్డు డీడీఎం అనురాధ, గ్రౌండ్ వాటర్ డీడీ కె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అనంతపురం కల్చరల్: వినియోగదారులకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తు సేవల్లో నాణ్యత లోపిస్తే చట్ట ప్రకారం ఆయా కంపెనీల యజమానులను బాధ్యులను చేయవచ్చన్నారు. వస్తువుకు సంబంధించి రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. అంతకు ముందు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, డీఈఓ ప్రసాదబాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, పలు సంఘాల ప్రతినిధులు నబీరసూల్, చల్లా కిషోర్, వన్నూరప్ప, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు పరిశీలనకు కేంద్ర బృందం



- జనవరి మొదటి వారంలో పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితుల పరిశీలనకు జనవరి మొదటి వారంలో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) రానున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల జాబితా ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ కరువు పరిస్థితులు నెలకొన్నా కేవలం అనంతపురం జిల్లాలో ఏడు, శ్రీ సత్యసాయి జిల్లాలో 10 మండలాలనే జాబితాలో చేర్చడంతో మిగిలిన 46 మండలాల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాలోని ఏడు మండలాల్లో పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు రూ.19 కోట్లతో నివేదిక సిద్ధం చేశారు. కేంద్ర బృందం పర్యటనలో క్షేత్ర స్థాయిలో జరిగిన పంటనష్టం పరిశీలన తర్వాత నివేదిక సమర్పించనున్నారు. ఆ తర్వాత పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) రూపంలో ఒక్కో రైతుకు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు పరిహారం మంజూరు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

రబీ 'ఇన్‌పుట్'పై నోరుమెదపరే...?

గత రబీకి సంబంధించి ప్రభుత్వం 17 మండలాలతో కరువు జాబితా ప్రకటించగా.. ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో కేంద్ర బృందం వచ్చి క్షేత్రస్థాయిలో పర్యటించి వెళ్లింది. ప్రధానపంట పప్పుశనగతో పాటు మరికొన్ని పంటలు దెబ్బతినడంతో 17 మండలాల పరిధిలోని రైతులకు రూ.37 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని నివేదిక అందించారు. కానీ ఆరు నెలలు కావస్తున్నా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకున్నా జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణలో అనంతపురంలోని అరవిందనగర్ సీఎస్ఐ చర్చి





అనంతపురంలో ఆకట్టుకుంటున్న శాంటాక్లాజ్, క్రిస్మస్ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

అంతటా క్రిస్మస్ శోభ

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రైస్తవులు తమ ఇళ్లకు విద్యుత్ దీపాలంకరణ చేయడంతో పాటు ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. క్రిస్మస్ తాత (శాంటాక్లాజ్) వేషధారులు సందడి చేస్తున్నారు. బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

'దౌర్జన్యంగా పునాదులు తవ్వేశారు'



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రామ్లానాయక్

వజ్రకరూరు: మండలంలోని ఎన్‌ఎన్‌పీ తండా జగనన్న కాలనీలో కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్న భూమిలో సోమవారం రాత్రికిరాత్రే జేసీబీతో పునాదులు తీసేందుకు సిద్ధమయ్యారని వైఎస్సార్ సీపీ గిరిజన సంఘం నాయకుడు రామ్లానాయక్ ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం తహసీల్దార్ నయాజ్ అహమ్మద్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామ్లానాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జగన్న కాలనీలో గ్రామానికి చెందిన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. ఈ స్థలాలను ఆక్రమించుకున్న కొందరు స్వార్థపరులు సోమవారం రాత్రి జేసీబీని ఏర్పాటు చేయించి పునాదులు తవ్వారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమ ఇష్టమంటూ దౌర్జన్యానికి దిగారన్నారు. దౌర్జన్యపరుల ఆట కట్టించి పేదల స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు.

క్లుప్తంగా

కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్



వజ్రకరూరు: కందుల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది అత్యధికంగా కంది పంట సాగులోకి వచ్చిందన్నారు. పంట దిగుబడులు చేతికి అందిన తర్వాత కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో తక్కువ ధరకే దళారులకు రైతులు విక్రయిస్తున్నారన్నారు. రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పేరుతో కాలయాపన చేయడం సబబు కాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా కంది రూ.8,500తో అమ్ముడు పోతోందన్నారు. పొరుగున ఉన్న కర్ణాటకలోనూ క్వింటా రూ.8,200 నుంచి రూ. 9 వేలు చొప్పున ధర పలుకుతోందన్నారు. కందులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు న్యాయం చేకూరేలా మద్దతు ధరను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రమణా యాదవ్, రైతు విభాగం నాయకుడు కాకర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట శివారులోని పీవీకేకే కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన ఇంజినీరింగ్ విద్యార్థిని కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు...శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలానికి చెందిన ఓ విద్యార్థిని ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పీవీకేకే కళాశాలలో తనకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి తల్లి, సోదరుడితో కలిసి వెళ్లింది. అనంతరం తల్లి, సోదరుడు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. పరీక్ష ముగిసే సమయానికి అక్కడికి చేరుకున్నారు. తక్కిన విద్యార్థులందరూ బయటకు వెళ్లిపోయినా కూతురు రాకపోవడంతో లోపలకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థులందరూ బయటకు వెళ్లిపోయారని యాజమాన్యం తెలపడంతో అనుమానం వచ్చిన తల్లి వెంటనే అనంతపురం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కళాశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అందులో పరీక్ష ముగిసేందుకు గంట ముందే సదరు విద్యార్థిని బయటకు వచ్చి ఆటోలో వెళ్లినట్లు గుర్తించారు. ఆటో డ్రైవరును అదుపులోకి తీసుకుని విచారించగా...ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రాప్ చేసినట్లు తెలిపాడు. ఆటో దిగిన విద్యార్థిని తర్వాత ఎటు వెళ్లిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

మనసులో మాట... చెప్పుకోలేం బయట



'నిజం చెప్పాలంటే ప్రభుత్వాన్ని ఎన్నుకునే విషయంలో ఉద్యోగులుగా మేము తప్పు చేశామనిపిస్తోంది. నేను మొదటి నుంచి టీడీపీ అభిమానినే. అయినా వాస్తవం చెప్పడంలో ముందుంటా. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఇప్పటికి ఆరు నెలలవుతున్నా ఉద్యోగులకు చేసిన మేలంటూ ఏమీ లేదు. మాకు అందాల్సిన బెనిఫిట్లపై కనీసం నోరు కూడా మెదపడం లేదు. ఐఆర్ ఎప్పుడిస్తారో.. ఎంతిస్తారో తెలియదు. అరియర్స్, డీఏలు, సరండర్ లీవ్‌ల ఊసే లేదు. నిజం అంగీకరించాల్సిన సమయమిది కాబట్టి చెబుతున్నా... గత ప్రభుత్వమే మాకు మంచి చేసింది. అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఐఆర్ ప్రకటించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ మాకు కరెక్టుగా జీతాలు చెల్లించారు. అయితే ఫిట్‌మెంట్, హెచ్ఆర్ఏ విషయంలో మేము తీవ్ర అసంతృప్తికి గురయ్యాం. దీంతో గత ప్రభుత్వం మాకు తక్కువ చేసిందనే భావనలో ఎన్నికల్లో వ్యతిరేకించాం. అయితే మేము చేసిన తప్పేమిటో ఇప్పుడు అర్థమవుతోంది'

– ఓ సీనియర్ ప్రభుత్వ ఉద్యోగి

...... ఇది ఒక్కరిది కాదు... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులందరి అంతరంగంలో మొదలైన అంతర్మథనం. మనసుకు, ఆలోచనలకు మధ్య ఘర్షణలో నలిగిపోతున్నారు. ప్రభుత్వం మారితే తమ ఇక్కట్లు తీరుతాయనుకున్నారు. మరింత ఎక్కువవుతాయని అనుకోలేదు. దాడులు... దౌర్జన్యాలు పెచ్చుమీరడంతో చివరకు మనసులో మాట ధైర్యంగా బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు. గత ఎన్నికల్లో కూటమికి మద్దతు ఇచ్చి పొరపాటు చేశామనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

• జిల్లాలోని ఓ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన కుమార్తె వివాహ ఖర్చుల కోసం పీఎఫ్ ఖాతా నుంచి రూ.5 లక్షల లోన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఖజానా శాఖలో బిల్ పాస్ చేసి ప్రభుత్వానికి పంపించి ఐదు నెలలైంది. ఇప్పటి వరకూ లోన్ మంజూరు కాలేదు. దీంతో అప్పు చేసి కుమార్తెకు పెళ్లి చేసి పంపారు.

• రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి తన భార్య శస్త్ర చికిత్స కోసం తన పీఎఫ్ ఖాతా నుంచి రూ.10 లక్షల లోన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే ఖజానా శాఖలో బిల్లు పాస్ అయ్యి ప్రభుత్వానికి వెళ్లింది. ఆరు నెలలు గడుస్తున్నా లోన్ మంజూరు కాలేదు. ఇలానే మరో ఉద్యోగి ఇంటి నిర్మాణం కోసం రూ.8 లక్షలు పీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఐదు నెలలు గడిచినా మంజూరు కాలేదు.

- అంతర్మథనంలో ప్రభుత్వ ఉద్యోగులు
- కూటమికి మద్దతిచ్చి తప్పు చేశామనే భావన
- ఆరు నెలలుగా చెల్లింపులకు నోచుకోని పీఎఫ్ లోన్
- జిల్లాలో 512 మందికి రూ.42.14 కోట్లు పెండింగ్
- తమ సమస్యపై స్వేచ్ఛగా మాట్లాడలేని దుస్థితి
- చెబితే ఏ ఇబ్బందికి గురిచేస్తారోననే భయం



అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఏ ప్రభుత్వ ఉద్యోగిని కదిపినా కూటమి సర్కార్ పాలనపై అసంతృప్తి ఉప్పెనలా బయట పడి పోతోంది. ప్రధానంగా ఆర్థిక పరమైన అంశాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఉద్యోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. వివిధ అవసరాల కోసం తమ పీఎఫ్ (భవిష్య నిధి) ఖాతా నుంచి లోన్ కోసం దరఖాస్తు చేసుకుని దాదాపు ఆరు నెలలవుతున్నా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'గత ప్రభుత్వంలో మా సమస్యలపై బహిరంగంగానే మాట్లాడాం. మా స్వేచ్ఛను అప్పటి ప్రభుత్వం ఏనాడూ అణిచివేయలేదు. అప్పటి ప్రభుత్వాన్ని నడిరోడ్డుపైనే విమర్శించినా మాకు ఎవరూ ఎలాంటి హాని తలపెట్టలేదు. అయితే అప్పటిలా ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడలేక పోతున్నాం. మా సమస్యలు బయటకి చెబితే ఏ ఇబ్బందికి గురిచేస్తారోనని భయమేస్తోంది' అని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

పీఎఫ్ లోన్ రూ.42 కోట్లు

వివిధ అవసరాలకు ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతా నుంచి రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 512 మంది ఉద్యోగులు పీఎఫ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రూ.42.14 కోట్లను మంజూరు చేయకుండా ఆరు నెలలుగా ప్రభుత్వం తొక్కిపెట్టింది. దీంతో చెల్లింపులు జరగలేదు. అత్యవసర ఖర్చుల నిమిత్తం పీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు... నెలలుగా మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు.

డీఏ, ఎస్ఎల్ పరిస్థితి అంతే

పీఎఫ్ లోన్ విషయంలోనే కాదు... కరువు భత్యం (డీఏ), సరెండర్ లీవ్ (ఎస్ఎల్) మంజూరులోనూ కూటమి ప్రభుత్వం కనీసంగానూ దృష్టి సారించడం లేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ప్రస్తుతం మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జనవరి వస్తే మరో డీఏ కలిపి పెండింగ్ లిస్టులోకి మొత్తం నాలుగు డీఏలు చేరుతాయని అంటున్నారు. ఇక సరెండర్ లీవ్ మొత్తాన్ని సైతం మంజూరు చేయడం లేదని... తమకు నాలుగు ఎస్ఎల్ రావాలని పోలీసులు చెబుతున్నారు.

ఐఆర్ ఇస్తుందో... ఇవ్వదో..

మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరు గమనిస్తుంటే ఐఆర్ చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నట్లుగా అర్థమవుతోందంటున్నారు. ఐఆర్ పరిస్థితే ఇలా ఉంటే... ఇక పీఆర్సీ ఉంటుందా? ఉండదా? అనేది కూడా తమకు అర్థం కావడం లేదంటున్నారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వ తీరుతో తాము మోసపోయామనే ఆవేదన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

ఫ్లెక్సీలపై 'అధికార' జులుం

• నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులకు వైఎస్సార్‌సీపీ వినతి



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రాప్తాడులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదమైంది. ఈ నెల 21న బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు సమయంలో వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం తొలగించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆ సమయంలో పట్టుపట్టడంతో అప్పట్లో పంచాయతీ కార్యదర్శి అక్కడి నుంచి జారుకున్నారు. ఈ అంశంలో తమకు చుక్కెదురు కావడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోయారు. దీంతో మరుసటి రోజు వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట ఉన్న రెండు ఫ్లెక్సీలను వదిలి మిగిలిన ఫ్లెక్సీలకు అనుమతులు లేవంటూ అధికారుల ద్వారా తొలగించేలా చేశారు. అక్కడితో ఆగకుండా సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదుట ఉన్న రెండు ఫ్లెక్సీలనూ కోసేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఫ్లెక్సీలను కోసేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ మంగళవారం ఉదయం సీఐ శ్రీహర్షకు వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, సాకే చంద్ర తదితరులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, చిరుతల నాగేంద్ర, సింగారప్ప, సాకే జయన్న, బులగొండ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు 'కూటమి' కరెంటు షాక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్ (చిత్రంలో) పార్టీ నేతలు

- విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం
- 27న వైఎస్సార్‌సీపీ పోరుబాటను జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు కరెంటు షాక్ ఇస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన పోరుబాటకు మద్దతుగా భారీగా తరలిరావాలని ప్రజలకు ఆ పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన కేవలం ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ భారం మోపారని మండిపడ్డారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం ఉదయం పది గంటలకు అనంతపురంలోని పాతూరు బ్రహ్మంగారి ఆలయం నుంచి పవర్ ఆఫీస్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు.

నాడు హేళన చేసి...

తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెడతామని గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హామీనిస్తే... అప్పటి సీఎం చంద్రబాబు హేళన చేస్తూ మాట్లాడారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టిన మరుక్షణమే ఉచిత విద్యుత్ పథకంపై వైఎస్సార్ సంతకం చేశారన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చడంలో వైఎస్సార్ కుటుంబానికి సాటి మరెవ్వరూ లేరని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారన్నారు. తన పాలనలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలపై పన్నుల భారం పడకుండా నాణ్యమైన విద్యుత్‌ను గత సీఎం వైఎస్ జగన్ అందజేశారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దళిత వాడల్లో అత్యంత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకప్పుడు కరెంటు పట్టుకుంటే షాక్ కొట్టేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో విద్యుత్ అధికారులు ఇస్తున్న కరెంటు బిల్లును పట్టుకుంటే ప్రజలు షాక్‌కు గురవుతున్నారన్నారు. ధనవంతులతో సమానంగా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలుండాలని భావించి 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అప్పటి సీఎం వైఎస్ జగన్ నెరవేర్చి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచారన్నారు. ప్రస్తుతం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమోహన్, రామ్మోహన్ గౌడ్, బెస్త వెంకటేశులు, తాడిమూరు నరేంద్ర, హేమకిరణ్, అంకె తేజ, లబ్బే రాఘవ, హిదయతుల్లా, రమేష్, చంద్రాయుడు, భాస్కర్, వినీత్, వంశీ, పాల్గొన్నారు.

హామీ మేరకు పెట్టుబడి సాయం చెల్లించాలి

• ఏపీ రైతుసంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడారు. హామీ ప్రకారం రైతులకు అటు ఖరీఫ్‌లోనూ, ఇటు రబీలోనూ రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు వన్నారెడ్డి, నరసింహులు, మహిళ నాయకురాలు లలితమ్మ, వెంకట్రాముడు యాదవ్, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా మారుస్తాం : ఎస్పీ

తాడిపత్రిటౌన్: గంజాయి రహిత జిల్లాగా మార్చాలనే సంకల్పంతో పని చేస్తున్నట్లు ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అలాగే పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో సైతం డ్రోన్‌లతో జల్లెడ పడుతున్నామన్నారు. పాత నేరస్తుల ఇళ్లు, దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గంజాయి మూలాలను కనిపెట్టేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు జాగిలాల సహాయంతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పార్శిల్ సర్వీస్, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, కార్గో సర్వీసులు, గోడౌన్, లాడ్జీలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తాడిపత్రిలో శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పట్టణంలో అల్లర్లు, గొడవలకు తావు లేకుండా చూస్తామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు వ్యవహరించాలన్నారు. మట్కా, పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామక్రిష్ణుడు, సీఐలు శివగంగాధర్‌రెడ్డి, రామసుబ్బయ్య, సీఐ ఈరన్న, ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచండి

పెద్దపప్పూరు/పెద్దవడుగూరు: సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్పీ జగదీష్ పోలీసుల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయా మండలాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు చోటివ్వరాదని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ మిగుల్చుకునేందుకే సంక్షేమ పథకాల్లో కోత

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: ''ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా బడ్జెట్ మిగుల్చుకునేందుకు సంక్షేమ పథకాల్లో కోతకు సిద్ధమయ్యింది. ఈ క్రమంలో అనర్హుల గుర్తింపు పేరుతో సర్వే చేపడుతోంది.పేదలకు అన్యాయం చేస్తే సహించబోము. వారి తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తాము'' అని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సీపీఎం 14వ జిల్లా మహాసభల్లో భాగంగా రెండవ రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం అనంతపురం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పథకాలు అందుకుంటున్న వారిలో అనర్హుల గుర్తింపు పేరుతో ప్రభుత్వం చేపట్టిన సర్వే సరైంది కాదన్నారు. పార్టీలపరంగా తొలగింపులు చేసి.. రాజకీయ వేధింపులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. సర్వే పేరుతో కుటుంబ సమాచారాన్ని మొత్తం సేకరించి బయటి కంపెనీలకు అమ్ముకునే ప్రమాదమూ ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే తాము డేటా ప్రైవసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దొడ్డిదారిన ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని తమ పార్టీ నిర్ణయించిందన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఎప్పుడూ లేనివిధంగా ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.16 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందని శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజలపై మోపుతున్న భారాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ బలవన్మరణం



మృతుడు అశోక్

పామిడి: స్థానిక చైతన్య కాలనీలో నివాసముంటున్న వడ్డె అశోక్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయిన అశోక్ ప్రస్తుతం తన తమ్ముడు బేల్దారితో కలసి చెల్లెలు లావణ్య, బావ రాజశేఖర్ ఇంట్లోనే కలసి ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన నుంచి భార్య రామాంజనమ్మ గతంలోనే విడిపోయింది. కొంతకాలంగా రక్తకణాల తగ్గుదల వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న అశోక్.. మంగళవారం ఉదయం తమ్ముడు, చెల్లెలు కుటుంబసభ్యులు కూలి పనుల కోసం బయటకు వెళ్లిన సమయంలో తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని గవాచీకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరేళ్ల వయసున్న మేనకోడలు హేమ ఎంత సేపు తలుపు బాదినా తీయకపోవడంతో ఏడుస్తూ వెళ్లి పక్కింటి వారికి తెలిపింది. దీంతో ఇరుగుపొరుగు వారు ఏకమై తలుపు బద్ధలుగొట్టి చూసేసరికి అశోక్ ఉరికి విగతజీవిగా వేలాడుతున్నాడు. తమ్ముడు ఆనంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



గుంతకల్లు: జీవితంపై విరక్తితో ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంతకల్లు శివారులోని ఎంబీఏ కళాశాల వద్ద రైలు మార్గంపై మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సుంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఉరవకొండ నుంచి గుంతకల్లుకు బస్సులో వచ్చినట్లుగా లభ్యమైన టిక్కెట్‌ను బట్టి మృతుడు ఉరవకొండ ప్రాంతానికి చెందిన వాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

జీవితంపై విరక్తితో ఓ వృద్ధురాలు...

గుత్తి: స్థానిక వక్కలకుంట ప్రాంతంలో నివాసముంటున్న లక్ష్మీదేవి (65) ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

యువరైతు ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటేశులు, ఇంద్రమ్మ దంపతులకు ఏకైక కుమారుడు కార్తీక్ (23) ఉన్నాడు. కొంత కాలం క్రితం తండ్రి మృతి చెందడంతో అప్పటి నుంచి తమకున్న పది ఎకరాల్లో తల్లితో కలసి వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా నిలిచాడు. సాగు చేసిన బొప్పాయి, టమాట పంటల్లో గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో పంట పెట్టుబడులకు చేసిన అప్పుల భారం పెరిగి రూ.11 లక్షలకు పైగా చేరింది. వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో మనస్తాపం చెందిన కార్తీక్ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి ఇంద్రమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ముఖం ఛిద్రమైంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా - యువకుడి దుర్మరణం



శేషానంద రెడ్డి (ఫైల్)

గుంతకల్లు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... గుంతకల్లు మండలం పాతకొత్తచెరువుకు చెందిన గుడుమచూరు సుంకిరెడ్డికి ఇద్దరు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు శేషానంద రెడ్డి (28)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్య చంద్రకళ, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భంతో ఉంది. వ్యవసాయ పనులతో పాటు తమకున్న ట్రాక్టర్‌ను అద్దెకు తిప్పుతూ కుటుంబానికి శేషానంద రెడ్డి చేదోడుగా నిలిచాడు. మంగళవారం ఉదయం పనిపై ట్రాక్టర్‌ను తీసుకుని కొంగనపల్లికి బయలుదేరిన శేషానంద రెడ్డి మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ మార్గంలో వస్తున్న వాహనదారులు గమనించి వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువ నేత మంజునాథ్‌రెడ్డి... ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. శేషానంద రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

క్లుప్తంగా

క్రిస్మస్ అందరిలో ఆనందాలను నింపాలి



కేక్ అందిస్తున్న భారతి సిమెంట్స్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: క్రిస్మస్ పర్వదినం అందరిలో ఆనందాలు నింపాలని భారతి సిమెంట్స్ ప్రతినిధులన్నారు. మంగళవారం రాత్రి సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ చర్చి, అరవిందనగర్ సీఎస్ చర్చి, చిన్మయానగర్ ఎస్ఎఫ్ఎస్ చర్చి, రామచంద్రానగర్‌లోని కార్మియల్ మాత మందిరాలకు భారతీ సిమెంట్స్ తరఫున క్రిస్మస్ కేకులనందించారు. ఈ సందర్భంగా సాగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏటా నగరంలోని చర్చిలకు భారతి సిమెంట్స్ తరుపున కేకులందించడం ఆనవాయితీగా వస్తోందని ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించామన్నారు. జిల్లా సేల్స్ మేనేజర్ సుబ్బారాయుడు, జిల్లా టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్‌నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

పశు గర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యసిబ్బంది

రామగిరి: కలికివాండ్లపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. పాడిపశువుల్లో మంచికట్టు శాతం రావటానికి ఆఖరుదశలో ఉన్నప్పుడు కృత్రిమ గర్భధారణ చేయిస్తే చూడి నిలు స్తుందని పశువైద్యుడు మౌలాలిబాషా పేర్కొన్నారు. పశువులకు పచ్చిమేత, దాణాలతోపాటు కొండచిగిరాకు, మునగాకు, కరివేపాకు, మొలకెత్తిన పెసలు, ఉలవలు, సద్దలు, రాగులు వేయాలన్నారు. హార్మోన్లు పోషకార లోపాలు లేకుండా చేయడం ద్వారా పశువులను త్వరగా చూలు కట్టించవచ్చన్నారు. ఈసందర్భంగా 37 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్‌తో పాటు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ఆత్మకూరు: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు పెద్ద కొండారెడ్డి ఆవు ఆయన పొలంలో మేతకు వెళ్లింది. పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నట్లు విద్యుత్ అధికారులు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదని, ఫలితంగా తన ఆవు మృతి చెందిందని బాధిత రైతు వాపోయారు. ఘటనలో రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు తెలియజేశాడు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న రైతు

చెన్నేకొత్తపల్లి: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు వారి సమస్యలను అర్జీల ద్వారా రెవెన్యూ అధికారులకు విన్నవించారు. మండల సర్వేయర్ సంతోష్‌లక్ష్మి, గ్రామ సర్వేయర్లు చంద్రమోహన్‌రెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, వీఆర్ఓలు తులశమ్మ, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పరిశుద్ధాత్ముడి ఆగమన వేళ..



విద్యుత్ కాంతులతో రాచానపల్లి ఏసు కృపా మందిరం



నగరంలో క్రిస్మస్ ట్రీలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

క్రిస్మస్ దివ్య సందేశం

సాటి మనిషిని ప్రేమించడమే క్రీస్తు లోకానికి అందించిన దివ్య సందేశం. క్రిస్మస్ అంటే కేవలం సంబరాలు కాదు. అంబరాన్నంటే విందు, వినోదాలు అసలే కాదు. ఈ పవిత్ర దినాన క్రీస్తును హృదయంలో ప్రతిష్టించుకోవాలి. పండుగకు కొత్త దుస్తులు కొనడమే కాకుండా కొత్త స్వభావం అలవర్చుకోవాలి. ఏసు వెలిగించిన జ్ఞాన జ్యోతి అందరిలో వెలిగేలా చూడడం నిజమైన క్రైస్తవుల బాధ్యత.

– రెవరెండ్ నెహెమ్యా నాగరాజు, జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు

- ముస్తాబైన ప్రార్థనా మందిరాలు
- మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు

అనంతపురం కల్చరల్: పరిశుద్ధాత్ముడి ఆగమన వేళ ప్రార్థన మందిరాలు నందడిగా మారాయి. దైవ కుమారుడి రాక కోసం సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాల కాంతులతో చర్చిలు విరాజిల్లుతున్నాయి. క్రైస్తవలోకాన్ని తరింపజేస్తూ మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. యేసు ప్రభు పుట్టిన రోజు ఆకాశంలో ఒక తార తళుక్కుమని మెరిసిందని బైబిల్ చెబుతోంది. దానికి సంకేతంగా అనేక చోట్ల విద్యుద్దీపాలతో కూడిన స్టార్స్‌ను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ తాత(శాంటాక్లాజ్) వేషధారణలు నందడి చేస్తున్నాయి. ప్రభువు పుట్టిన పశువుల పాకకు గుర్తుగా ప్రతి క్రైస్తవుల ఇంట క్రిస్మస్ చెట్లను అందంగా అమర్చుకున్నారు.

శాంతి సందేశం..

ఏసు ప్రేమకు గుర్తుగా వందల ఏళ్ల నాటి ప్రార్థనా మందిరాలు శాంతి సందేశానందిస్తున్నాయి. శతాబ్దాల కిందటే ఏర్పడిన అరవిందనగర్ సీఎస్ఐ చర్చి, సప్తగిరి కూడలిలోని ఎస్ఐయూ చర్చి, కోర్టు రోడ్డు గాస్పెల్ హాలు, రామచంద్రానగర్‌లోని కార్మియల్ మాతా మందిరం, క్రీస్తు ప్రార్థనా మందిరం, కళాకారుల కాలనీ రేమా చర్చి తదితర చోట్ల క్రిస్మస్ వేడుకలను ఆహ్వానిస్తూ దైవజనులు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ప్రార్థనలకు సేవలను జోడిస్తూ పలు చోట్ల నిత్యావసరాల పంపిణీ, దుస్తుల వితరణతో పాటూ పలుచోట్ల క్రిస్మస్ కేకులను అందిస్తున్నారు. ఏసయ్య జన్మదినం సంబరంగా సాగడానికి చర్చిల్లో ఇప్పటికే భక్తులు పోటెత్తుతున్నారు. వాడవాడలా పాస్టర్లు క్రీస్తు జీవిత సందేశాన్ని అందిస్తున్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక గుత్తిరోడ్డు, సంగమేష్‌నగర్‌లోని మాంటిస్సోరి విద్యా సంస్థలను రంగురంగుల బూరలు, క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నారులు శాంటాక్లాజ్, ఫెయిరీల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మినర్వా పాఠశాలలో...

స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు ఏంజెల్స్, శాంటాక్లాజ్ వేషధారణలో కనువిందు చేశారు. క్రీస్తు జననాన్ని తెలిపే ఘట్టాలతో విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. ప్రపంచానికి శాంతి సందేశాన్ని బోధించిన క్రీస్తు జీవితాన్ని కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి వివరించారు.

అనంతపురం రూరల్: ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ అరుణ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శదాయమకమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



మాంటిస్సోరి స్కూల్‌లో శాంటాక్లాజ్, ఫెయిరీల వేషధారణలో చిన్నారుల ప్రదర్శన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి



మినర్వా స్కూల్‌లో క్రీస్తు జన్మదినాన్ని సూచించే పశువుల పాక నమూనా



రాప్తాడులో కరుణమయుడు చర్చి ముందు ఏర్పాటు చేసిన స్టార్

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

రాప్తాడు/ ఆత్మకూరు: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. రాప్తాడులోని కరుణమయుడు (డాన్ బోస్కో) చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా చర్చిల ముందు క్రీస్తు జననానికి సంబంధించి పశువుల పాకతో పాటు శాంటాక్లాజ్, క్రిస్మస్ చెట్టును అలంకరించారు. క్రైస్తవులు తమ ఇళ్లకు విద్యుత్ దీపాలంకరణ చేయడంతో పాటు ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఇక ఆత్మకూరు మండలం పి.యాలేరులోని చర్చిని అందంగా ముస్తాబు చేశారు. ఆత్మకూరు, పంపనూరు, సనప, తలుపూరులోని చర్చిలు క్రిస్మస్‌కు సిద్ధమయ్యాయి. ఇదిలా ఉండగా రాప్తాడు కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్లో ప్రత్యేకంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల చేత శాంటాక్లాజ్, మేరిమాత, దేవదూతల వేషధారణ వేయించారు. అలాగే క్రీస్తు జననం అనే నాటికను ప్రదర్శించారు. అంతేకాకుండా క్రీస్తును స్తూతిస్తూ చిన్నారులు చేసిన గీతాలపన అలరించింది.



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న పి.యాలేరు చర్చి

మాజీ కార్పొరేటర్‌కు నివాళి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ సాకే పోతులయ్య మృతి పట్ల వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నవోదయ కాలనీలో నివాసముంటున్న మాజీ కార్పొరేటర్ పోతులయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు మృతునికి ఇంటికి వెళ్లి నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ధైర్యాన్ని నింపారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఒక మంచి నాయకుడిని కోల్పోయామని అనంత వెంకటరామిరెడ్డి విచారం వ్యక్తం చేశారు. అనంతరం భాగ్యనగర్‌లోని ఖాసీం క్యాటరింగ్స్ యజమాని ఖాసీం భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అనంత చంద్రరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, నాయకులు చింతకుంట మధు ఉన్నారు.



పోతులయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ఘనంగా మహ్మద్ రఫీ శత జయంత్యుత్సవాలు

అనంతపురం కల్చరల్: 'నా మది నిన్ను పిలిచింది గానమై వేణు గానమై..' 'షిరిడీ వాలే సాయిబాబా' అంటూ తెలుగు హిందీ గీతాలనాలపించిన మహ్మద్ రఫీ గళం మార్మోగింది. భారతీయ సినీ సంగీతానికి ప్రత్యేక కీర్తిని తెచ్చిపెట్టిన మహ్మద్ రఫీ శత జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన వేడుకల్లో ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, నిర్వాహకులు రాంబో స్టూడియో అస్లాంబాషా, డిస్కోబాబు తదితరులు మాట్లాడారు. భారతీయ భాషలన్నింటిల్లో మహ్మద్ రఫీ స్వరం మంత్రముగ్దులను చేసిందని, దేశానికే గర్వకారణమైన గొప్ప నేపథ్య గాయకుడికి నివాళులర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కళాకారులతో పాటూ కర్ణాటక నుంచి విచ్చేసిన నిర్మలనీలి, మధ్యప్రదేశ్ నుంచి విచ్చేసిన హిందీ గాయకులు రియా, ఫారూక్ అద్భుతమైన గీతాలతో ఆకట్టుకున్నారు.



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో 'అనంత' విద్యార్థి ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 'అనంత' విద్యార్థి సత్తా చాటాడు. నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో ఫస్టియర్ విద్యార్థి జి.తిప్పేష్ రాష్ట్రస్థాయిలో తృతీయస్థానంలో నిలిచాడు. మంగళవారం విజయవాడలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఇదిలాఉండగా విద్యార్థి జి.తిప్పేష్ జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోనూ మొదటిస్థానంలో నిలిచాడు. ఇంటర్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.



మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తిప్పేష్

విద్యుత్ బిల్లుల పెంపుపై 27న వైఎస్సార్‌సీపీ నిరసన

రాప్తాడు: విద్యుత్ బిల్లులు పెంపుపై ఈ నెల 27న స్థానిక విద్యుత్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ సీపీ నేత చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరవుతారన్నారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం దగ్గర నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం వారు కార్యాక్రమానికి అనుమతి ఇవ్వాలని సీఐ శ్రీహర్షకు వినతిపత్రం ఇచ్చారు.

పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి

అనంతపురం అర్బన్: మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులను క్రమబద్ధీకరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 19న జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో రాజారెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏఐటీయూసీ నగరాధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజారెడ్డిని ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌పై పోరాటం సాగిస్తామన్నారు. జీఓ 549 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఉపాధ్యక్షులు నాగవేణి, శ్రీనివాసులు, నాయకులు రాజు, నారాయణ, వేణు, శివకృష్ణ, నాగరాజు, వెంకటేష్, శోభ పాల్గొన్నారు.



రాజారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వేమన పద్య పోటీలు జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్: విద్యార్థులు, యువతరంలో నైతిక విలువలను పెంచడమే లక్ష్యంగా సాగే వేమన పద్య పోటీలను జయప్రదం చేయాలని మాజీ ఉపకులపతి కాడా రామకృష్ణారెడ్డి కోరారు. వేమన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సాగే వేమన పద్య పోటీల పోస్టర్లను మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కేంద్ర సాహితీ అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కాడా రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. వేమన పద్య పోటీలను వంద పాఠశాలల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేశామని, జనవరి 9 లోపు పాఠశాల స్థాయి కార్యక్రమం జరుగుతుందన్నారు. అందరికీ ప్రశంసా పత్రాలు, మెడల్స్, వేమన పుస్తకాలను బహుమతులుగా అందిస్తామని తెలిపారు. వివరాలకు 9963917187 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు మనోహరరెడ్డి, లోకన్న, జలీల్ అహ్మద్, వన్నూరు సాబ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

కుప్పకూలిన ఆంధ్రా జట్టు

- పేలవమైన ఆటతీరుతో కేవలం 143 పరుగులకే ఆలౌట్
- అర్ధసెంచరీతో రాణించిన వరుణ్ సాత్విక్

అనంతపురం: మహారాష్ట్ర బౌలర్ల ధాటికి ఆంధ్ర జట్టు కుప్పకూలింది. అనంత క్రీడాగ్రామం వేదికగా బీసీసీఐ, ఏసీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్–19 కూచ్‌బెహార్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య నాలుగు రోజుల మల్టీడే మ్యాచ్‌లు జరుగుతున్న విషయం తెలిసిందే. 69/3తో ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ మూడో రోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 63.5 ఓవర్ల వద్ద 143 పరుగులకు ఆలౌట్ అయింది. మహారాష్ట్ర లెగ్ స్పిన్నర్ శుభం కాదమ్ తన మాయాజాలంతో ఆంధ్రను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. 39 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు కూలదోశాడు. ఆంధ్ర బ్యాటర్లలో వరుణ్‌సాత్విక్ (50), లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులతో ఆకట్టుకున్నారు. కాగా, మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో 277 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. జట్టులో సుప్రూత్ సావంత్ (56) నాటౌట్‌గా నిలిచాడు. నీరజ్ జోషి 38, కిరణ్ చోర్మాలే 22 పరుగులు చేశారు. కాగా, బుధవారం చివరి రోజు కావడంతో మ్యాచ్ డ్రా గా ముగిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో పాయింట్ల ప్రాతిపదికన అగ్రస్థానంలో ఉన్న మహారాష్ట్ర జట్టు సెమీ ఫైనల్ దిశగా దూసుకెళుతోంది.



ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాక్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 118 మందికి ఉద్యోగాలు దక్కాయి. రేవాటెక్‌లో 40 మంది, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్‌లో 30 మంది, ఐ-సస్ టెక్నాలజీస్‌లో 35, టీసీఎస్ (నాన్-ఐటీ)13 మంది ఉద్యోగాలు దక్కించుకున్నారు. మొత్తం 220 మంది హాజరుకాగా, 118 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడంపై రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు, డీఎస్‌డీఓ ప్రతాప్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కే.అనిత, ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్కేయూ రెక్టార్ జి.వెంకటనాయుడు

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

అనంతపురం అర్బన్: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా నియామకాలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అంధ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.రాము, అసోసియేట్ అధ్యక్షుడు గంగన్న పేర్కొన్నారు. సమస్యపై ఇన్‌చార్జి కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చిన వారు మీడియాతో మాట్లాడారు. దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది మార్చి 29న కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. దీంతో అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసి వైద్య ధ్రువీకరణ పరీక్షలు, విద్యా ధ్రువీకరణ పత్రాలు పరిశీలన పూర్తి చేసి నెలలవుతున్నా నియామకాలు చేపట్టలేదన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించామన్నారు. నియామకాలు చేపట్టకపోతే దివ్యాంగుల సంక్షేమ శాఖవద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అంధుల సంఘం ప్రధాన కార్యదర్శి రాము

అక్రమ కట్టడం తొలగింపు



కట్టడాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం సుభాష్‌రోడ్డు(కమర్షియల్ ఏరియా)లో ఓ వ్యక్తి జీప్లస్2 భవనం పేరిట నిర్మాణం చేపడుతున్నాడు. వాస్తవంగా రోడ్డుకు స్థలం వదలాల్సి ఉన్నా నిర్మాణదారుడు అతిక్రమించాడు. నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశాలతో టీపీఓ శిరీష, టీపీఎస్ మంజుల జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఇదిలా ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు ఇవ్వకపోవడంతో ఆక్రమణలను తొలగించినట్లు చర్చ జరుగుతోంది. కాగా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్న భవనం పక్కనే మరో భవనం నిబంధనలను అతిక్రమిస్తున్నా..అధికారులు అటువైపు ఎందుకు తొంగి చూడలేదని చర్చనీయాంశంగా మారింది. ఏదిఏమైనా టీపీఓ శిరీష, టీపీఎస్ మంజుల నిర్ణయాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాప్తాడు: పాలచెర్లలో మంగళవారం గడ్డివామికి నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు చిన్నపసల బాలచంద్రారెడ్డి కల్లందొడ్డిలో ఇంటిని నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. తన ఇంటి సమీపంలోనే ఆరు ట్రాక్టర్ల వరిగడ్డి, రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టుతో కలిపి వామి వేసుకున్నాడు. బాలచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు తోట దగ్గర వేరుశనగ పంటలో కలుపు తొలగించేందుకు వెళ్లారు. ఇంటి దగ్గర ఎవరూ లేరని గ్రహించిన గుర్తు తెలియని వ్యక్తులు వామికి నిప్పుపెట్టారు. ఫైర్ సిబ్బంది వచ్చే లోపు వామి మొత్తం కాలిపోయింది. ఘటనలో దాదాపుగా రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.